సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 18 । మార్చి । 2025



తలరాతను మార్చేది చేతిరాతే..
అందమైన చేతిరాత భవితకు బాటలు వేస్తుంది. పరీక్షల్లో విద్యార్థులు అధిక మార్కుల సాధనకు ఉపయోగపడుతుంది. పిల్లల చేతిరాతపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి.
8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:22	బుధ : 5:05

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /23.0

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 95శాతం హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 95శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 6,465 మందికి గాను 6,148 మంది విద్యార్థులు హాజరు కాగా 317 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 5,779 మందికి గాను 5,535 హాజరు కాగా 244 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 686 మందికి గాను 613 మంది హాజరుకాగా 73 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో అంజయ్య తెలిపారు.

ఫార్మాసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: మందుల పంపిణీ, వ్యాక్సిన్లు నిల్వ చేయడంలో ఫార్మాసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయంలో సోమవారం జిల్లాలోని ఫార్మసిస్టులకు ఎనీమియా ముక్త్ భారత్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి ఫార్మాసిస్టులు సూపర్ చైన్ మేనేజ్‌మెంటు వ్యాక్సినేషన్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వాతావరణ మార్పులతో కీటక జనిత వ్యాధులు, అసంక్రమణ వ్యాధులు వచ్చే వీలుండడంతో వాటికి సంబంధించిన మందులను నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ప్రతీ ఆరోగ్య కేంద్రంలో రోజూ తీసుకున్న మందులు, వ్యాక్సిన్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, జిల్లా ఫార్మాసిస్టు డాక్టర్ ప్రసాద్, డీపీహెచ్ఎన్ పద్మ, డెమో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు



పాల్గొన్న ఎస్ఈ గంగాధర్, అధికారులు

భీమారం: వేసవి కాలంలో విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. భీమారంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.కోటితో ఏర్పాటు చేసిన 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. వేసవి ఎండల కారణంగా విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సబ్‌స్టేషన్లలో పలు పరికరాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పట్టణాలతోపాటు గ్రామాలకు కూడా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీఈ కైసర్, ఏడీఏ బాలకృష్ణ, ఏఈ శంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రిలే నిరాహార దీక్ష



రిలే దీక్ష చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణ పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఏఎంసీ క్రీడామైదానం ఎదురుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు రామగిరి మహేష్ ఆధ్వర్యంలో మాదిగ శ్రేణులు దీక్ష చేశారు. దీక్షా శిబిరాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ సరిగా చేపట్టలేదన్నారు. ఏ, బీ, సీ, డీ చేయాల్సి ఉండగా ఏ, బీ, సీ చేసి చేతులు దులిపేసుకుందని అన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ జరగాల్సి ఉండగా అశాస్త్రీయంగా చేశారని పేర్కొన్నారు. ఈ కారణంగా మాదిగలు, ఉపకులాలకు అన్యాయం జరిగిందని, ఆ అన్యాయాన్ని సరి చేయాలని డిమాండ్ చేశారు. మాదిగలకు మంత్రివర్గంలో రెండు మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జిలకర శంకర్, మచ్చ రాజేష్, నాతరి శివ, పుల్లూరి రాము, బి.రవీందర్, బి.రాంచందర్, రామకృష్ణ, పద్మక్క, రాజలింగు, భూమయ్య పాల్గొన్నారు.

మామిడి కొనలేం..!



బెల్లంపల్లిలోని మామిడి మార్కెట్

- ట్రేడర్ల నిరాసక్తత
- అవగాహన కల్పించినా ముందుకు రాని వైనం
- నిరుపయోగంగా మామిడి మార్కెట్
- రైతులకు దక్కని ప్రయోజనం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని మామిడి మార్కెట్‌లో మామిడి కాయల క్రయవిక్రయాల కోసం మార్కెటింగ్ శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ట్రేడర్లకు అవగాహన కల్పించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరూ ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవడానికి ముందుకు రాలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో యేటా మాదిరిగానే ఈసారి కూడా నాగ్‌పూర్ మార్కెట్‌కు తరలించి పంట దిగుబడి అమ్ముకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుబాటులో మామిడి మార్కెట్ ఉన్నా క్రయవిక్రయాలు చేపట్టకపోవడంతో అలంకార ప్రాయంగా మారింది.

ఆది నుంచీ సమస్యే..

బెల్లంపల్లి పట్టణంలో మామిడి మార్కెట్ ఉన్న మాటే గానీ మామిడి రైతులకు ఏ మాత్రం ఉపయోగపడకుండా పోతోంది. క్రయవిక్రయాలకు నోచుకోవడం లేదు. మామిడి దిగుబడి కొనుగోలు చేయడానికి ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్లు మార్కెటింగ్ శాఖ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉండగా.. ఏళ్ల తరబడి నుంచి విముఖత చూపుతున్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు గత డిసెంబర్‌లో ప్రత్యేక చొరవ తీసుకుని ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. నెలలు గడుస్తున్నా లైసెన్స్ తీసుకోవడానికి ట్రేడర్ల నుంచి సానుకూలత వ్యక్తం కాకపోవడం నిరాశకు గురి చేస్తోంది. ట్రేడర్లు ముందుకు రాకపోవడం వల్లనే మామిడి మార్కెట్‌లో మామిడి దిగుబడుల క్రయవిక్రయాలు జరగడం లేదు. ట్రేడర్ల సమస్య ప్రతిబంధకంగా మారింది.

పిందె దశలో తోటలు

మామిడి తోటలు పూత దశను దాటి ప్రస్తుతం పిందెలు తొడుగుతున్నాయి. ఉగాది పండుగ నాటికి ఓ మోస్తరు పరిమాణం కాయలు మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ చివరి వారం నుంచి దాదాపు మామిడి కాయలు మార్కెట్‌కు రావడం మొదలవుతుంది. మామిడి దిగుబడుల అమ్మకాలకు సమయం ఆసన్నం అవుతుండగా మరోపక్క ట్రేడర్ల సమస్య మామిడి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఏటా రూ.వందల కోట్లకు పైగా సాగే మామిడి వ్యాపారంపై పాలకులు, ప్రభుత్వ అధికారులు శ్రద్ధ వహించకపోవడం రైతులకు శాపంగా మారింది.

సౌకర్యాలు కల్పించినా..

2015 సంవత్సరంలో మ్యాంగో మార్కెట్ మంజూరు కాగా నిర్మాణానికి రూ.1.26 కోట్లు వ్యయం చేశారు. రెండు మ్యాంగో కవర్ షీట్స్, ప్రహరీ నిర్మించగా, అదనపు సౌకర్యాల కోసం 2023 సంవత్సరంలో మరో రూ.1.18 కోట్లు కేటాయించారు. వీటిలో నుంచి రూ.8 లక్షలతో ఆర్వో ప్లాంట్, రూ.36 లక్షలతో మ్యాంగో మార్కెట్ అంతర్భాగంలో సీసీ రోడ్డు నిర్మాణం చేయగా మిగిలిన రూ.74 లక్షలతో మరో కవర్‌షీట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

జిల్లా వివరాలు
మామిడి తోటల విస్తీర్ణం(ఎకరాల్లో) 17,538
రైతుల సంఖ్య : 500 పైబడి
హెక్టారుకు గరిష్ఠ దిగుబడి : 7 టన్నులు
ఏటా వ్యాపారం(అంచనా ప్రకారం) రూ.200 కోట్లు

ప్రయత్నాలు చేస్తున్నాం



మామిడి కాయల విక్రయాల కోసం ఎంతగానో యత్నాలు చేస్తున్నాం. నాలుగు నెలల క్రితం ట్రేడర్ల, కమీషన్ ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాం. కానీ ఇంతవరకు ఏ ఒక్కరు కూడా ట్రేడ్ లైసెన్స్ తీసుకోలేదు. ఎందువల్ల ట్రేడర్లు ముందుకు రావడం లేదో అర్థం కావడం లేదు. మరోసారి కూడా సమావేశం నిర్వహించి మామిడికాయల కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
– మహ్మద్ షాబుద్దీన్, మార్కెటింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్

ఎన్నో ఏళ్లుగా నష్టపోతున్నాం..



ఎన్నో ఏళ్ల నుంచి మామిడికాయలు నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి వ్యాపారులు, దళారుల మోసానికి గురవుతూ గిట్టుబాటు ధర రాక మస్తు నష్టపోతున్నం. మోసపోతున్న మామిడి రైతుల ఇబ్బందులను గుర్తించి పదేళ్ల కిందట బెల్లంపల్లిలో మ్యాంగో మార్కెట్ నిర్మాణం చేసిండ్లు. కానీ ఇప్పటిదాకా ఏ ఒక్క ఏడాది సుత కొనుగోళ్లు చేపట్టలేదు. ట్రేడర్స్‌తో మాట్లాడి కొనుగోళ్లు చేయించడంలో మార్కెటింగ్ అధికారులు పట్టింపు చేస్తలేరు. ఈసారైనా ట్రేడర్స్‌ను ఒప్పించి మ్యాంగో మార్కెట్‌లో మామిడి కాయలు అమ్ముకునే అవకాశాలు కల్పించాలి.
– సాటపురి చందు, మామిడి రైతు

ఇదేంటి అయ్యగారు?

- బుగ్గ ఆలయ పూజారిపై ఫిర్యాదుల వెల్లువ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో ప్రముఖ ఆలయంగా ప్రసిద్ధిగాంచిన బెల్లంపల్లి మండలం కన్నాల పరిధి బుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకుడి వ్యవహారం వివాదాస్పదమవుతోంది. ఎంతో పవిత్రంగా భావించే ఆలయ అర్చకుడిపై గత కొంతకాలంగా అనేక ఆరోపణలు వస్తున్నాయి. నిత్యం జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తుంటారు. పర్వదినాల్లో భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఆలయ పరిసరాల్లో గత కొంతకాలంగా జరుగుతున్న తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ అక్కడి పూజారి గుడికి వచ్చే మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని దేవాదాయ శాఖకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆలయంలో హుండీ డబ్బులతోపాటు అనధికారికంగా భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేయడంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక గుడి హుండీలో వేసిన కానుకల విషయంలోనూ అవకతవకలు, చోరీలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. దేవాలయ పరిధిలో జరుగుతున్న తీరుపై పాలకవర్గం సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని, గత కొన్నేళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా పట్టింపు కరువైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గుడి పూజారిపై దేవాదాయ శాఖకు ఫిర్యాదులు వెళ్లడంతో ఇప్పటికే చర్యలకు సిద్ధమైంది. ఇటీవల గుడి ఆవరణలో కొబ్బరికాయలు అమ్ముకునే వారు చేసిన ఆరోపణలు, ఫిర్యాదులతో గత జనవరిలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. అధికారుల చర్యల నుంచి తప్పించుకునేందుకు రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. దీనిపై ఆలయ ఈవోను ఫోన్‌లో సంప్రదించాలని ప్రయత్నించినా అందుబాటులో రాలేదు.

పకడ్బందీగా ‘పది’ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు, సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ భాస్కర్, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, డీఈవో యాదయ్యలతో కలిసి సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 49 మంది ముఖ్య పర్యవేక్షకులు, 49 మంది శాఖ అధికారులు, నలుగురు సీ సెంటర్ కస్టోడియన్లు, 461 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, అంతరాయం లేకుండా విద్యుత్, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. జిల్లాలో ఐదు రూట్లు ఏర్పాటు చేశామని, ప్రశ్న, జవాబు పత్రాల తరలింపు సమయంలో ఒక ఎస్సై, ఒక కానిస్టేబుల్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి అంజయ్య, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సోమవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్యశ్రీ వార్డు, డయాలసిస్, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిష్టర్లు, హాజరు పట్టిక, ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో నూతన భవనం నిర్మాణం మరో మూడు నెలల్లోపు పూర్తయి అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ భీష్మ పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇంటివద్దకే రాములోరి కల్యాణ తలంబ్రాలు

మంచిర్యాలఅర్బన్: భద్రాచలంలో ఏప్రిల్ 6న జరిగే శ్రీసీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ కార్గో సేవ విభాగం ఆధ్వర్యంలో ఇంటివద్దకే కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేయనున్నట్లు డీఎం జనార్ధన్ తెలిపారు. సోమవారం మంచిర్యాల కార్గో ఆధ్వర్యంలో కల్యాణ తలంబ్రాలు బుకింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాముల కల్యాణం జరిగిన తర్వాత ముత్యాలతో కూడిన తలంబ్రాలను వినియోగదారులకు పంపిణీ చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు మంచిర్యాల లాజిస్టిక్ ఇంచార్జి 73828 41860, 98667 71482, 91542 98541 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



బుకింగ్ చేసుకుంటున్న డీఎం జనార్థన్

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

- కన్నెపల్లి మండలం చింతపూడి లింగాల గ్రామంలో గుడుంబా, బెల్ట్‌షాపుల నిర్వహణతో యువత పెడదారి పడుతున్నారని, గుడుంబా, మద్యం విక్రయాలు నియంత్రించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు.
- హైదరాబాద్ జీహెచ్ఎంసీ కార్మికులకు అందిస్తున్న వేతనాలను మంచిర్యాల మున్సిపల్ కార్మికులకు అందించాలని జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.
- కుటుంబ సర్వే దరఖాస్తుల డేటా ఎంట్రీ డబ్బులు ఇప్పించాలని మంచిర్యాలకు చెందిన సురేష్‌కుమార్ దరఖాస్తు అందజేశారు.
- విద్యార్థినులు, ఉపాధ్యాయినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆరోపణల నేపథ్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌ను విధుల్లో నుంచి తొలగించాలని, బెల్లంపల్లి ఎస్సీ బాలుర పోస్టుమెట్రిక్ వార్డెన్ కోరుట్ల శ్రీనివాస్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి మృతిచెందాడని, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, సికిందర్, బ్రహ్మానందం, శంకర్ కోరారు.

పింఛన్ రావడం లేదు..



గత ఆరు నెలలుగా దివ్యాంగుల పింఛన్ రావడం లేదు. సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ చేయలేదని నిలిపివేశారు. మున్సిపల్ కార్యాలయంలో సంప్రదిస్తే సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకోవాలని అంటున్నారు. ఆ సైట్ ఎప్పుడూ బంద్ ఉంటుంది. దయచేసి నాకు పింఛన్ వచ్చేలా చూడాలి.
– కే.తేజ, రాజీవ్‌నగర్, మంచిర్యాల

రైతు బీమా రాలేదు..



మా నాన్న తిరుపతి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. గత డిసెంబర్‌లో అనారోగ్యం కారణంగా చనిపోయాడు. రైతుబీమా పరిహారం రాలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే తిరస్కరణకు గురైందని చెబుతున్నారు. అన్ని అర్హతలున్నా ఎందుకు రావడం లేదో ఎవరు చెప్పడం లేదు.
– డి.విక్రమ్, బెల్లంపల్లి

పింఛన్ మంజూరు చేయాలి




మానసిక వైకల్యంతో జన్మించిన మా కూతురు మూతి పావని (15)కి పింఛన్ మంజూరు చేయాలి. సదరం క్యాంపులో దరఖాస్తు చేసుకోగా వైద్యులు 100శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇప్పటివరకు పలుమార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇంతవరకు రాలేదు.
– మూతి పావనితో తల్లిదండ్రులు సుజాత, రాజు

అక్రమ పట్టా రద్దు చేయండి



హాజీపూర్ మండలం దొనబండ గ్రామం సర్వే నంబరు 253/ఆలో 22 గుంటల భూమి మా పేరుమీద పట్టా ఉంది. ఈ భూమిలో పంట సాగు చేసుకుంటున్నాం. ధరణి పోర్టల్ వచ్చాక గునగంటి రాజరత్నం అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకున్నాడు, పలుమార్లు ఫిర్యాదు చేశాం. అతనిపై చర్యలు తీసుకుని అక్రమ పట్టా రద్దు చేయాలి.
– మేదరి సాగర్, మంచిర్యాల

రోడ్డు ఆక్రమించారు..



కన్నెపల్లి మండలం నాయకపేట్‌లోని పంటపొలాలకు వెళ్లకుండా రోడ్డు ఆక్రమించి సాగు చేస్తున్నారు. మండల శివారులో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కెనాల్ కోసం ప్రభుత్వం పట్టాభూములు సర్వే నంబరు 183, 206, 218, 201, 198, 410లో భూ మి తీసుకున్నది. పట్టాదారులకు పరిహారం అందజేసింది. కాలువ పనులు నిలిచిపోయాయి. పరిహారం తీసుకున్న కూడా సాగు చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి.
– నాయకపేట్ గ్రామ రైతులు, మం: కన్నెపెల్లి

పత్తి కొనుగోళ్లు చేపట్టాలి..



గత వారం రోజులుగా చెన్నూర్ సీసీఐ పత్తి కొనుగోలు జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి వాహనాలతో పడిగాపులు కాస్తున్నాం. వరుసలో ఉన్న కొంతమందికి గురువారం టోకెన్లు ఇచ్చారు. శుక్రవారం హోలీ పండుగ, శని, ఆదివారాల్లో సెలవు కాగా తిరిగి సోమవారం పత్తి కొనుగోలు చేస్తారని ఎదురు చూస్తే కొనుగోలు చేయడం లేదు. వెంటనే పత్తి కొనుగోలు చేపట్టాలి.
– చెన్నూర్, జైపూర్, భీమారం మండలాల పత్తి రైతులు

వేలంలో పాల్గొంటేనే సింగరేణి మనుగడ

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొంటేనే సంస్థకు మనుగడ ఉంటుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం ఆయన ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త బొగ్గు గనుల చట్టం ప్రకారమే గనులు కేటాయిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి వేలంలో పాల్గొనేలా యాజమాన్యాన్ని ఆదేశించాలని అన్నారు. డైరెక్టర్(పా), సీఎండీ, జేసీసీ సమావేశాల్లో కార్మికుల ప్రధాన డిమాండ్లను యాజమాన్యం ముందుంచామని తెలిపారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, అలవెన్స్‌లపై ఆదాయ పన్నును సంస్థనే చెల్లించాలని, మెడికల్ అన్‌ఫిట్ మైనింగ్‌స్టాఫ్, టెక్నికల్ సూపర్‌వైజర్లకు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని, 11 రకాల అలవెన్స్‌లను పెంచాలని తదితర డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.33 వేల కోట్ల బకాయిలను సింగరేణికి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు అద్దు శ్రీనివాస్, గొల్లపల్లి రామచందర్, సత్తిరెడ్డి భోగ మదనయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందుగులపేట జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌బ్రిడ్జి ముగింపు సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, జీన్స్ ప్యాంట్ ఉన్నాయని, ప్యాంటు జేబులో ఆదివారం మధ్యాహ్నం బెల్లంపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సు టికెట్ లభించిందని తెలిపారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 8712656570 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నిర్మల్‌లో మేకల అపహరణ

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలో కొన్ని రోజులుగా మేకలు చోరీ అవుతున్నాయి. ఈనెల 15న కాలనీవాసి భీమన్నకు చెందిన రూ.45 వేల విలువ చేసే నాలుగు మేకపోతులను దొంగలు ఎత్తుకెళ్లారు. గత నెలలో శాంతినగర్ కాలనీలోని అనిల్‌కు చెందిన మేకల మంద నుంచి నాలుగు మేకలను అపహరించుకుపోయారు. వరుసగా దొంగలు మేకలను అపహరిస్తుండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా దొంగలను పట్టుకోవడం లేదని పేర్కొన్నారు.

అనారోగ్య కారణాలతో ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన జెజ్జరి సాయినాథ్(50) అనారోగ్య కారణాలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ నైలు తెలిపారు. సాయినాథ్ కొన్ని రోజులుగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రతీ రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కుటుంబీకులతో భోజనం చేసి పడుకున్న తర్వాత సాయినాథ్ గ్రామ సమీపంలోని పద్మశాలి సంఘ భవనం స్లాబ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ సమీపం 61వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గుండోజి నాగార్జున, శ్రీరామ్ వెంకటరమణ, నిర్మల్‌కు చెందిన నగేశ్ ద్విచక్ర వాహనంపై రాంపూర్ గ్రామానికి వెళ్తుండగా.. నందన్ గ్రామానికి చెందిన కూన కల్యాణ్ ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుంచి నందన్ గ్రామం వైపు వస్తుండగా నసీరాబాద్ గ్రామ సమీపంలో ఎదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో నాగార్జున, వెంకటరమణ కుడికాలు విరిగింది. నగేష్, కూన కల్యాణ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గ్రామస్తులు 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణ బావ దర్వాసువారు ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తలరాతను మార్చేది చేతిరాతే

'మంచి చేతిరాత లేకపోతే చదువు పూర్తి కానట్లే. పెదవులపై చిరునవ్వు లేనిదే మేకప్ పూర్తి కాదు'
– 'సత్యశోధన'లో మహాత్మాగాంధీ

- అందమైన రాత.. భవితకు బాట
- విద్యార్థులకు అవగాహన తప్పనిసరి
- అధిక మార్కుల సాధనకు ఉపయోగం
- పోషకులు దృష్టి సారించాలి


తెలుగురాతపై సాధన చేస్తున్న గోయగాం ఉన్నత పాఠశాల విద్యార్థినులు

కెరమెరి(ఆసిఫాబాద్): అక్షరం విలువ తెలపడానికి.. మన భావాల్ని స్పష్టంగా వ్యక్తం చేయడానికి అందమైన దస్తూరి అవసరం. కానీ సాంకేతిక పుణ్యమా అని..ఆయుధం లాంటి అక్షరం అష్టవంకర్లు పోతోంది. 'నేను క్షేమం.. మీరు క్షేమమా'అంటూ రాసే లేఖలు మాయమయ్యాయి. హలో.. హాయ్ అంటూ సంక్షిప్త సందేశాలు గిర్రున తిరుగుతున్నాయి. కంప్యూటర్లు, ట్యాబ్, మొబైల్‌ల కారణంగా కాగితంపై పెన్ను పెట్టాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఈ తరుణంలో ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే పాఠశాలల్లో చదివే సగం మంది విద్యార్థులు చేతిరాత గుండ్రంగా రాయలేక పోతున్నారు. ఫలితంగా మంచి మార్కులు పొందలేక పోతున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా ఈ నెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. చేతిరాత బాగుంటే పరీక్షల్లో విద్యార్థులు మంచి గ్రేడులు సాధించే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో నిపుణుల సూచనలు, ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేతిరాత భవిష్యత్‌కు సోపానంలా ఉపయోగపడేందుకు అవసరమైన నియమాలు, సూచనలు.

దోషాలు

చిన్న చిన్న దోషాలే విలువైన మార్కులకు కోత పెడతాయన్న విషయాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలి. సాధారణ విద్యార్థులు పరీక్షల్లో నాలుగు రకాల తప్పులు చేస్తుంటారు. అవి మార్కులకు తగ్గట్లు సమాధానాలు రాయక పోవడం, వ్యాకరణ దోషాలు, అక్షర దోషాలు, చేతిరాత గజిబిజిగా ఉండడం. ఇందులో ఎక్కువగా మార్కులకు గండి కొట్టేది దస్తూరి అని నిపుణులు పేర్కొంటున్నారు.

- ప్రశ్నలకు సమాధానం రాసేటప్పుడు విరామ చిహ్నాలు మర్చిపోతుంటారు.
- అక్షరాల ఖాళీ స్థలాన్ని వదులుతారు.
- అక్షరాలు, సంఖ్యలను స్పష్టంగా రాయడం.
- కాగితంపై పెన్ను ఒత్తిపట్టి రాస్తే ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తుంది.
- కొట్టి వేతలు మనం పరీక్షకు సన్నద్ధం కాలేదని చెబుతాయి.
- ఏ4 సైజ్ కాగితంలో 20 నుంచి 25 వరుసలు రాస్తుంటారు.
- లైన్లు వంకర టింకరగా ఉంటాయి
- బొమ్మల్లో భాగాలను సరిగా గుర్తించరు.
- పదాల్ని కలిపేసి రాస్తుంటారు.
- కలాన్ని ఇష్టం వచ్చినట్లుగా పట్టుకోవడంతో చేతిరాత గజిబిజిగా ఉంటుంది.
- ఎర్ర రంగు సిరా కలాన్ని ఉపయోగిస్తారు.
- ఇలాంటివి చేయకపోవడం వల్ల అధిక మార్కులు పొందే అవకాశం ఉంది.

ఉపయోగాలు

- చేతిరాత అందంగా ఉంటే పరీక్షల్లో మార్కుల సాధనలో ముందున్నట్లే.
- ఉపాధ్యాయుల ప్రశంసలు పొందాలన్నా, ఉద్యోగం చేసే చోట యజమాని మెప్పు పొందాలన్నా అందమైన రాత కీలకం.
- ఉద్యోగ సంబంధ నోటిఫికేషన్లు స్వదస్తూరితో నింపిన దరఖాస్తులను మాత్రమే పంపాలని నిబంధన ఉందంటే చేతిరాత ప్రాముఖ్యత ఎంతగా ఉందో అవగతమవుతోంది.
- ప్రధానంగా మానవ వనరుల విభాగం బహుళజాతి సంస్థలు, ఉద్యోగ నియామకాల్లో చేతిరాతను కూడా ప్రాతిపదికగా తీసుకుంటారు.
- మనసులో అలజడులు చేతిరాతతో ప్రతిఫలిస్తాయి. కనుకనే మానసిక వైద్యశాస్త్రంలో చేతిరాతకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇటీవలి కాలంలో చేతిరాతను బట్టి, మనస్తత్వాన్ని బట్టి అంచన వేసే గ్రాఫాలజి శాస్త్రాలు అందుబాటులోకి వచ్చాయి.
- చేతిరాతతో ఒక వ్యక్తిలోని 200 విషయాలను తెలుసుకోవచ్చని లిపి నిపుణులు పేర్కొంటున్నారు.

నైపుణ్యం అలవర్చుకోవాలి



రాసేటప్పుడు కూర్చునే భంగిమ, కలం పట్టుకునే విధానం, పుస్తక స్థాన విధానం, చేతిరాతపై ప్రభావం చూపుతాయి. బాల్‌పాయింట్ పెన్నుకన్నా సిరాపెన్నుతో చేతిరాత అందంగా వస్తుంది. సున్న, అరసున్న తెలుపు గీతలను బాగా సాధన చేయాలి. ఆంగ్లం, తెలుగు, చూచిరాత మెరుగుదల కోసం అపసవ్య దశలో రాసే నైపుణ్యం అలవర్చుకోవాలి. హిందీ రాత మెరుగుకోసం సవ్య దశలో రాయడం అలవాటు చేసుకోవాలి. చేతిరాతపై పిల్లలతో పాటు పెద్దలు దృష్టి సారించాలి.

– పెందోర్ జైవంతా, తెలుగు పండితురాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోయగాం

సాధన చేస్తున్నా



చక్కటి చేతిరాతపై సాధన చేస్తున్నా. ప్రతీరోజు తెలుగు, హిందీ, ఆంగ్లం చూచిరాత రాస్తున్నా. రాత పద్ధతులపై టీచర్ బాగా చెబుతున్నారు. పరీక్షల్లో గ్రేడులు అధికంగా సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. పేపర్ దిద్దేవారికి కూడా ఎంతో సులభమవుతుంది. అందమైన రాత విద్యార్థి క్రమశిక్షణను తెలియజేస్తుంది. ప్రతీ విద్యార్థి చేతిరాతపై ప్రాక్టీసు చేయాలి.

– మోహర్లే జయ, 9వ తరగతి, గోయగాం

హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగానికి ఎంపిక


మార రజనీకాంత్‌రెడ్డి


పటాన్ సిరాజ్‌ఖాన్

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన మార రజనీకాంత్ రెడ్డి సోమవారం హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఉద్యోగానికి ఎంపికయ్యారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో సిటీ బస్‌కండక్టర్ ఉద్యోగానికి ఆయన రాజీనామా చేశారు. కాగా హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్తా చాటిన సిరాజ్‌ఖాన్

బజార్‌హత్నూర్: టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో మండలంలోని కొలారి గ్రామానికి చెందిన పటాన్ సిరాజ్‌ఖాన్ సత్తా చాటాడు. రైతు పటాన్ అంజత్‌ఖాన్, షకీలాబేగంల కుమారుడు సిరాజ్‌ఖాన్ రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెన్నెల: ఆదిల్‌పేట కాలువ నుంచి మందమర్రి మండలం మామిడిగట్టుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ మోహన్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను నెన్నెల పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు అప్పగించామని పేర్కొన్నారు. డ్రైవర్‌తోపాటు ట్రాక్టర్ యజమాని మోర్లె మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సైకిల్ పై నుంచి పడి వ్యక్తి మృతి


మృతుడు రాజయ్య

కాసిపేట: మండలంలోని దేవాపూర్ మద్దిమాడ శివారులో సైకిల్ పై నుంచి కిందపడి ఓరియంట్ రిటైర్డ్ లోడింగ్ కార్మికుడు గాసికంటి రాజయ్య (65) మృతిచెందాడు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ మండలం సబ్బుపల్లికి చెందిన రిటైర్డ్ లోడింగ్ కార్మికుడు రాజయ్య ఈ నెల 16న దేవాపూర్‌లోని తన కుమారుడు మల్లేష్ ఇంటికి వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు తన స్నేహితుడిని కలవడానికి కొత్త గడ్పూర్‌కు వెళ్లి తిరిగి ఏడు గంటల ప్రాంతంలో కుమారుడి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో మద్దిమాడ శివారులోని కల్వర్టు వద్ద సైకిల్ పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులోపడి ఒకరు మృతి


మృతుడు సుంకరి శ్రీనివాస్

నర్సాపూర్(జి): కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన మండలంలని చర్లపల్లిలో సోమవారం జరిగింది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... రాంపూర్ అనుబంధ గ్రామం చర్లపల్లికి చెందిన సుంకరి శ్రీనివాస్(45) సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి గ్రామ శివారులోని ఊర చెరువు వద్దకు వెళ్లాడు. ఉదయం 9 గంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతకగా ఒడ్డుపై శ్రీనివాస్ చెప్పులు కనిపించాయి. వెంటనే ఈతగాళ్లతో చెరువులో గాలించగా శ్రీనివాస్ మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు చెరువుల పడి మృతిచెందాడని శ్రీనివాస్ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సిర్పెల్లి గ్రామానికి చెందిన పబ్బు గణేశ్(48) తన చేనులో విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై పి.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్ తనకున్న 12 ఎకరాల్లో రెండెకరాలు మొక్కజొన్న సాగుచేశాడు. చేనుకు నీరు పెట్టేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో కొడుకు సంజయ్ 1 గంటకు చేను వద్దకు వెళ్లాడు. అయితే అప్పటికే గణేశ్ మరణించి ఉన్నాడు. మోటార్ ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌తో మరణించినట్లు గుర్తించిన అజయ్ వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు గణేశ్‌ను విగత జీవిగా చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గణేశ్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

బెల్లంపల్లి: మండలంలోని లంబాడితండా గ్రామ శివారులో పేకాట స్థావరంపై తాళ్ల గురిజాల పోలీసులు సోమవారం దాడి చేశారు. తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడితండా గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. బుధాకలాన్ గ్రామానికి చెందిన నిధుల రమేష్, ఎండల రమేష్, రాందేని రవి, దాడి మల్లేష్, ఆవునూరి గోపి, బోయిన రవిలను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు దుర్గం రాజేష్, రాసకొండ తిరుపతి, ఆవునూరి శ్రావణ్ పారిపోయారని ఎస్సై ప్రకటించారు. నిందితుల నుంచి రూ.3,630, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు

నిర్మల్ టౌన్: ఒకరిని చంపడానికి ప్రయత్నించిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ.. నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి దల్లు సింగ్ తెలిపిన విరాల ప్రకారం.. తానూరు మండలం బోసి గ్రామానికి చెందిన రఘునాథ్ వ్యవసాయం చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన విఠల్ రఘునాథ్ కు చిన్ననాటి స్నేహితుడు. రెండేళ్ల క్రితం విఠల్ భార్య లక్ష్మి బామినీ గ్రామానికి వెళ్లడానికి గ్రామంలోని శిశు మందిర్ వద్ద నిలబడి ఉంది. అదే సమయంలో రఘునాథ్ మహలింగి గ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. లక్ష్మి ముందు నుంచి వెళ్తున్న రఘునాథ్‌ను ఆపి తనను బామినీ ఎక్స్ రోడ్ వద్ద దింపేయాలని కోరింది. ఈ మేరకు రఘునాథ్ ఆమెను బైక్‌పై ఎక్కించుకొని దింపేశాడు. ఈ విషయంపై లక్ష్మి భర్త విఠల్ కోపం 2024, అక్టోబర్ 24న రఘునాథ్ గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గొడ్డలితో తల మీద కొట్టి, చంపాలని ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న రాజేశ్వర్ , హన్మాండ్లు అడ్డుకోగా.. విఠల్ పారిపోయాడు. రఘునాథ్‌కు గాయాలు కావడంతో భైంసా ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. రఘునాథ్ భార్య జ్యోతి తానూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయంతో కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి, చార్జిషీట్ దాఖలు చేసి, నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి, నేరం రుజువు చేశారు. ఈ మేరకు జిల్లా సెషన్స్ జడ్జి విఠల్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమాన విధిస్తూ.. సోమవారం తీర్పు చెప్పారు.

దాడి చేసిన ఆరుగురికి..

నిర్మల్ టౌన్:ఓ వ్యక్తిపై కర్రలతో దాడికి దిగిన పలువురికి నిర్మల్ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ.. తీర్పు ఇచ్చింది. జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీకి చెందిన లింగన్న తన భార్యతో గొడవపడి వేరుగా ఉంటున్నాడు. తర్వాత జిల్లా కేంద్రానికి చెందిన రజితతో పరిచయం ఏర్పడడంతో స్థానిక సోఫీ నగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. 2019 అక్టోబర్ 9న సాయంత్రం 5 గంటల సమయంలో లింగన్న రజిత ఇంట్లో ఉండగా.. లింగన్న భార్య లావణ్య, ఐదుగురు బంధువులతో కలిసి కర్రలతో దాడిచేశారు. ఈ విషయంపై రజిత నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి, విచారణ చేపట్టి, కోర్టులో ప్రవేశపెట్టారు. సోమవారం నిర్మల్ న్యాయస్థానం లావణ్య, ఆమె ఐదుగురు బంధువులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి..

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి సాగు చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ.రమేష్ సోమవారం తీర్పునిచ్చారు. సిర్పూర్(యూ) ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(యూ) పోలీసుస్టేషన్ పరిధిలోని మధురతాండ గ్రామ శివారులో కట్కవార్ రావుసింగ్ తన పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నాడన్న సమాచారం మేరకు 2021 అక్టోబర్ 24న అప్పటి ఎస్సై విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. లాభాపేక్షతో పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నట్లు తేలింది. కేసు నమోదు చేసి సాక్షులను కోర్టులో హాజపర్చగా నేరం రుజువైంది. నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్‌మోహన్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేష్, సిర్పూర్ ఎస్సై రామకృష్ణ, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్‌ను ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో చెన్నూర్ మండల వాసి
- హన్మకొండ జిల్లాలో ఘటన
- దైవదర్శనానికి వెళ్తుండగా ప్రమాదం


సుశాంత్ (ఫైల్)

హసన్‌పర్తి: దైవదర్శనానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి హన్మకొండ జిల్లా పరకాల–కిట్స్ కళాశాల ప్రధాన రహదారిలోని ముచ్చర్ల క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన మేకల సుశాంత్ (19), మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం పొక్కూరు గ్రామానికి చెందిన తాండ్ర విజయ్(19), జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన సి.వర్ధన్(18) స్నేహితులు. సుశాంత్ పరకాలలోని పాలిటెక్నిక్‌లో థర్డ్ ఇయర్ చదువుతుండగా, వర్ధన్ అదే కళాశాలలో పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్ అభ్యసిస్తున్నాడు. విజయ్ పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. వీరు ముగ్గురు అదే ప్రాంతంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ చదువు కొనసాగిస్తున్నారు.

హాస్టల్ నుంచి జాతరకు..

ఆదివారం రాత్రి 9.30గంటలకు సుశాంత్, విజయ్, సి.వర్ధన్ పరకాల నుంచి బైక్‌పై ఎర్రగట్టు జాతరకు బయలుదేరారు. సుశాంత్ బైక్ నడుపుతుండగా, విజయ్, వర్ధన్ వెనుక కూర్చున్నారు. వీరితోపాటు మరికొంత మంది విద్యార్థులు కూడా వారి వెంట తమతమ బైక్‌లపై జాతరకు పయనమయ్యారు. సుశాంత్ నడుపుతున్న బైక్‌ను ముచ్చర్ల శివారులోని జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతానికి చేరుకోగానే ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెనుకాల బైక్‌పై వస్తున్న స్నేహితులు 108లో ఎంజీఎంకు తరలించారు. అప్పటికే సుశాంత్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికిత్స పొందుతూ విజయ్ సోమవారం తెల్లవారు ప్రాణాలు వదిలాడు. వర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మృతుడు సుశాంత్ తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

అడవిపంది దాడిలో యువరైతుకు గాయాలు

దిలావర్‌పూర్:మండలంలోని కాల్వ తండాకు చెందిన యువ రైతు జాదవ్ నరేష్‌పై సోమవారం అడవిపంది దాడిచేసింది. మొక్కజొన్న, వరి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అప్పటికే తోటలో పందుల గుంపు పడింది. గమనించిన అతడు పంటను కాపాడేందుకు కేకలు వేస్తూ పరుగెత్తాడు. ఓ పంది అతడిపై దాడిచేసింది. ఈ ఘటనలో కాళ్లకు గాయాలయ్యాయి. నరేశ్ అరుపులు విని సమీపంలోని చేలలో ఉన్న రైతులు పరిగెత్తుకుంటూ రావడంతో పందులు పారిపోయాయి. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కాల్వతండా రైతులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

దోపిడీ దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మ్యాక్స్ భవన్ వద్ద ఈ నెల 14 దోపిడీకి పాల్పడిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ తెలిపారు. సంబంధిత వివరాలను ఆయన కార్యాలయంలో వెల్లడించారు. స్థానిక బెల్లంపల్లి చౌరస్తాలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగి ప్యాగ పోశంపై దాడి చేసి ఆయన వద్ద ఉన్న బంగారు గొలుసును దోచుకున్నారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశామని, సీసీ ఫుటేజీ ఆధారంగా బండి నంబర్‌ను గుర్తించి దోపిడీకి పాల్పడిన దొంగలను గుర్తించామని తెలిపారు. స్థానిక సంజీవయ్య కాలనికి చెందిన ఎండీ.సమీర్, ఎండీ.జుబీర్‌లను అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించారని తెలిపారు. నిందితుల నుంచి బంగారు గొలుసు, కత్తి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై ప్రవీన్‌కుమార్, సిబ్బంది సుబ్బారావ్, మహేష్, ఉపేందర్‌లను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ అభినందించారు.

సికిల్‌సెల్ నిర్మూలనే లక్ష్యం


అధికారులతో రాష్ట్ర ప్రోగ్రాం అధికారి హీన దీక్షిత్

ఆదిలాబాద్‌టౌన్: సికిల్‌సెల్ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బ్లడ్ సెల్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డాక్టర్ హీన దీక్షిత్ అన్నారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో సికిల్‌సెల్‌పై జిల్లా స్థాయి టీవోటీ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2047 వరకు సికిల్‌సెల్ (ఎనీవియా) అంతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. సికిల్‌సెల్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది, దాన్ని ఎలా అరికట్టాలో మాస్టర్ ట్రైనర్ హెమటలాజీ ప్రొఫెసర్ రాధిక ప్రొజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రొగ్రామ్ అధికారి శ్రీధర్, ఏటీడీవో అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వహిస్తున్న మహిళా గ్యాంగ్ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో మట్కా జూదం నిర్వహిస్తున్న మహిళా గ్యాంగ్‌ను టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రానగర్‌లో మట్కా ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన షేక్ ఖలీల్, షేక్ రంజానీ, పర్జానా, షబానా, రిజ్వానా, మలేక బీలు మట్కా నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన నల్ల కేశవ్, గాంధీనగర్‌కు చెందిన కాంబ్లే బాబు షా డబ్బులు పెట్టి మట్కా ఆడుతున్నట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.2,260 నగదుతో పాటు మట్కా చిటీలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారిని స్టేషన్‌కు తరలించే క్రమంలో పర్జానా తాను స్టేషన్‌కు రానని, తనను తీసుకెళితే బ్లేడ్‌తో గొంతు కోసుకుంటానని అనడంతో సదరు మహిళపై మట్కా కేసుతో పాటు మరో కేసు నమోదు చేసినట్లుగా సీఐ వివరించారు.

తొలికాత విద్యార్థులకే..

- పాఠశాలలో ఏటా పుచ్చకాయలు అందజేస్తున్న రైతు ఆనంద్


పుచ్చకాయలను చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతు ఆనంద్

ఆ రైతుకు పిల్లలంటే ఎనలేని ప్రేమ. వారిని దైవంగా భావిస్తాడు. ఏటా తన చేనులో సాగైన పుచ్చకాయల తొలికాతను వారికే అందజేస్తాడు. ఐదేళ్లుగా ఇదే ఆనవాయితీ కొనసాగిస్తున్నాడు. అతడే తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన రైతు అండె ఆనంద్. తనకున్న రెండెకరాల్లో ఏటా పుచ్చ సాగు చేస్తున్నాడు. దిగుబడి షురూ అయ్యే క్రమంలో తొలికాతను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐదేళ్లుగా అందజేస్తున్నాడు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు అందజేశాడు. ఇందులో మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రఘు, ఉపాధ్యాయులు సరిత,శిల్ప సిబ్బంది ఉన్నారు.

– తాంసి